



# విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం | 10.05.2024 | హైదరాబాద్




## బీజేపీకి ఓటేస్తే..
# రిజర్వేషన్లు రద్దేనా?

- రాజ్యాంగం కూడా రద్దు కానుందా?
- కొత్త రాజ్యాంగం రానుందా?
- బీజేపీకి సపోర్టుగా బీఆర్ఎస్
- అదే జరిగితే ఇవే చివరి ఎన్నికలా?
- పాలకుర్తిలో ఇప్పుడిదే హాట్ టాపిక్
- క్రమంగా కడియం కావ్య వైపే ఓటర్ల మొగ్గు
- ఆమెకు అండగా ఝాన్సీ రెడ్డి, యశస్విని రెడ్డి విస్తృతంగా ప్రచారం





**18వ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, బీఆర్ఎస్, టీడీపీ వంటి పలు జాతీయ, ప్రాంతీయ పార్టీలు దూసుకెళ్తున్నాయి. అబ్‌కీ బార్ మోదీ సర్కార్, అబ్ కీ బార్ 400 పార్ వంటి నినాదాలతో బీజేపీ, పంచ్ న్యాయ్, హాత్ బదిలేగా హాలత్ అనే నినాదంతో కాంగ్రెస్ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అయితే 75 ఏళ్ళ స్వతంత్ర భారతంలో భారత రాజ్యాంగం, రిజర్వేషన్ల గురించి ఈ ఎన్నికల్లో జరిగినంత చర్చ గతంలో ఏ ఎన్నికల్లోనూ జరగలేదు. దీనికి ప్రధాన కారణం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. రాజ్యాంగం పట్ల రిజర్వేషన్లు పట్ల బీజేపీ, ఆ పార్టీ నేతల వ్యతిరేఖ వైఖరి. గత రెండు దఫాలు వరుసగా సొంత మెజారిటీతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. ఈ సారి 400కు పైగా లోక్ సభ సీట్లు సాధించడమే లక్ష్యంగా ఎన్నికల బరిలోకి దిగింది. ఈ ఎన్నికల్లో బీజేపీ 2/3 మెజారిటీ సీట్లు సాధిస్తే భారత రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని, అదేవిధంగా రిజర్వేషన్లు రద్దు చేస్తారని ప్రజాస్వామిక వాదులు, ప్రగతి శీల వాదులు, వివిధ కుల సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.** - విశాల భారతి, పాలకుర్తి



*అదే జరిగితే దేశంలో ఇవే చివరి ఎన్నికలని సాక్షాత్తు ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున వంటి విపక్ష నేతలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఎంతో పోరాటం చేసి సాధించుకున్న రిజర్వేషన్లు శాశ్వతంగా రద్దు అవుతాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ కులాలకు చెందిన ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా 100 ఏళ్ళు వెనక్కి పోతారని రాహుల్ గాంధీ, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ లాంటి ఇండియా కూటమి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అది జరగకుండా ఉండాలంటే కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి రావాలని వారంతా నొక్కి చెబుతున్నారు. ఇక వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గంలో ఇదే అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. ముఖ్యంగా పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సామాన్య జనం కూడా ఈ అంశంపై సీరియస్ గా డిస్కస్ చేస్తున్నారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల వైఖరిని ఎండగట్టడం, రాజ్యాంగాన్ని.. రిజర్వేషన్లను రక్షించడానికి ప్రజలను చైతన్య పరచడంలో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజక వర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సక్సెస్ అవుతున్నారు. బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్‌కు వ్యతిరేకంగా.. కాంగ్రెస్ క్యాండిడేట్ కడియం కావ్య గెలుపు కోసం అత్తాకోడళ్లు కృషి చేస్తున్నారు.*

## రాజ్యాంగం రద్దు కానుందా..?

గత రెండు దఫాలుగా బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండగా.. ఆ పార్టీ నుంచి నరేంద్ర మోడీ ప్రధానిగా కొనసాగుతున్నారు. ఈ సారి కూడా కేంద్రంలో బీజేపీదే అధికారం అంటూ మోడీతో పాటు ఆ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అయితే కేంద్రంలో ఈసారి బీజేపీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి ఆ స్థానంలో కొత్త రాజ్యాంగాన్ని తీసుకొస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. రాజ్యాంగాన్ని మార్చాలంటూ అనంత్ కుమార్ హెగ్డే, జ్యోతి మిర్ధా, దియా కుమారి, అరుణ్ గోవిల్ వంటి పలువురు బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలు అందుకు సాక్ష్యమని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఒకవేళ ప్రస్తుతమున్న రాజ్యాంగం రద్దు అయితే భారత ప్రజాస్వామ్యం ప్రమాదం లో పడుతుందని, అణగారిన వర్గాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. బీజేపీ గెలిస్తే దేశంలో ఇవే చివరి ఎన్నికలు అని వారు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని వర్గాలకు మేలు చేసేలా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, అందుకు బీజేపీని ఓడించాలని, భారత రాజ్యాంగం కొనసాలంటే కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిని గెలిపించుకోవాలని పిలుపునిస్తున్నారు.

## అగ్రవర్ణాల పార్టీగా బీజేపీపై ముద్ర..

అరూరికి తీవ్ర నష్టంవరంగల్ పార్లమెంట్ స్థానం ఎస్సీకి కేటాయించగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి కడియం కావ్య, బీజేపీ నుంచి అరూరి రమేష్, బీఆర్ఎస్ నుంచి మారేపల్లి సుధీర్ కుమార్ పోటీ చేస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ తరపున వర్ధన్నపేట నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అరూరి రమేష్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ తరపున వరంగల్ నుంచి ఎంపీగా పోటీ చేయాలని భావించారు. అయితే అధిష్టానం టికెట్ నిరాకరించడంతో అయన బీజేపీలో చేరి ఆ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆయన పేరు సుపరిచితమే అయినప్పటికీ బీజేపీ నుంచి పోటీ చేయడం ఆయనకు ఇబ్బందిగా మారింది. బీజేపీ అగ్ర వర్ణాల పార్టీ.. బ్రాహ్మణుల పార్టీ, మనువాదుల పార్టీ అనే ప్రచారం ఉంది. అలాగే దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ వ్యతిరేక పార్టీగా బీజేపీపై ఆరోపణలు ఉన్నాయి. ఇక కేంద్రంలో మూడోసారి మోడీ అధికారంలోకి వస్తే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని, రిజర్వేషన్లను ఎత్తివేస్తారనే ప్రచారం కూడా ఆయనకు మైనస్ గా మారింది. దీంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఒకవేళ అయన గెలిచినా అభివృద్ధి విషయంలో ప్రజలకు పెద్దగా ప్రయోజనం ఉండదని ప్రజలు భావిస్తున్నారు.

## మోడీ మూడోసారి పీఎం అయితే
# రిజర్వేషన్లు ఎత్తేస్తారా?

ఇక మూడోసారి మోడీ పీఎం అయితే రిజర్వేషన్లు ఎత్తివేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇందుకు ఆ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నేతలు చేసిన వ్యాఖ్యలను విపక్షాలు గుర్తు చేస్తున్నాయి. తమకు 400కు పైగా ఎంపీ స్థానాలు కట్టబెట్టాలని, ఆలా చేస్తే పెను మార్పులు తీసుకొస్తామంటూ ప్రధాని మోడీతో పాటు పలువురు కేంద్రమంత్రులు పిలుపునిస్తుండడం అందుకు బలాన్ని చేకూరుస్తోంది. ఎన్నడూ లేని విధంగా ఈసారి 400 సీట్లు కట్టబెట్టాలని ప్రధాని మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా వంటి బీజేపీ అగ్ర నేతలు చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ రిజర్వేషన్లు ఎత్తివేస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు ఆభిప్రాయపడుతున్నారు. కాగా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్లను డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారు. వారితో పాటు బీసీలు, మహిళలకు కూడా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని అయన పోరాటం చేసినా.. కొన్ని కారణాల వాళ్ళ అది కార్యరూపం దాల్చలేదు. అయితే అనంతరం జరిగిన అనేక పోరాటాల వల్ల విద్య, ఉద్యోగ రంగాల్లో ఓబీసీలకు 27 శాతం, అగ్ర వర్ణాల్లోని పేదలకు ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం రిజర్వేషన్ ఫలాలు అందుతున్నాయి. కానీ చట్ట సభల్లో అడుగు పెట్టేందుకు మాత్రం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించలేదు. దీనికోసం దేశవ్యాప్తంగా ఓబీసీ సంఘాలు పోరాటం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బీజేపీ అడుగులు వేస్తోందని ఓబీసీ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే వారంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. తాము అధికారం లోకి రాగానే కులగణన చేస్తామని, జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ ఫలాలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇస్తున్న హామీల పట్ల ఓబీసీల్లో సానుకూలత వ్యక్తమవుతోంది.

## పార్టీలు మారని వారెవరు?.. పార్టీ మారితే తప్పా?

ఇక వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ మార్పు అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. అందుకు కారణం ఇటీవల స్టేషన్ ఘనపూర్ నుంచి బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి, తన కూతురు కడియం కావ్యతో పాటు కాంగ్రెస్ లో చేరడం. అనంతరం కడియం కావ్య కాంగ్రెస్ నుంచి వరంగల్ స్థానం నుంచి పోటీ చేయడం. ఈ నేపథ్యంలోనే ఎలా పార్టీ మారుతారంటూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్యపై విమర్శలు చేస్తున్నారు. ఇక స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య అయితే మరి వ్యక్తిగతంగా దూషిస్తూ తండ్రి కూతుళ్లపై తన అక్కసంతా కక్కుతున్నారు. అసలు కడియం శ్రీహరి ఎస్సీనే కాదని, అలాంటప్పుడు అయన కూతురు కావ్య ఎస్సీ ఎలా అవుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కావ్య ఆంధ్రకు చెందిన ఓ ముస్లింను పెళ్లి చేసుకుందని.. ఆమెకు ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదని వింత ఆరోపణలు చేస్తున్నారు.అయితే వరంగల్ ప్రజలు మాత్రం కడియం శ్రీహరి, కడియం కావ్యకు బాసటగా నిలుస్తున్నారు. తమకు నచ్చిన పార్టీలోకి మారడం నేరమా లేక ఏమైనా రాజద్రోహమా అని ప్రశ్నిస్తున్నారు. పార్టీలు మారని వారు ఎవరు అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎంపీ టికెట్ రాలేదని రాజయ్య కాంగ్రెస్ లోకి పోలేదా అని అంటు న్నారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ నుంచి బయటకు పోయిన వెంటనే రాజయ్య తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరలేదా అని నిలదీస్తున్నారు. ముస్లింను పెళ్లి చేసుకోవడం తప్పా? ముస్లింలు ఈ దేశ పౌరులు కాదా అని ప్రశ్నిస్తున్నారు. ఇక బీజేపీ నుంచి పోటీ చేస్తున్న అరూరి రమేష్ బీఆర్ఎస్ లో టికెట్ రాకపోవడంతో బీజేపీలో చేరింది వాస్తవం కాదా అని నిలదీస్తున్నారు. కేంద్ర మంత్రులు, సీఎంలు, మాజీ సీఎంలు వంటి వారే తమకు నచ్చిన పార్టీలో చేరుతున్నారని, ఈ రోజుల్లో పార్టీ మార్పు అనేది సర్వ సాధారణమని వరంగల్ ప్రజలు కడియం శ్రీహరి, ఆయన కూతురుకు అండగా నిలబడుతున్నారు.








## కడియం కావ్య గెలుపు నల్లేరు మీద నడకే..

కాంగ్రెస్ తరపున వరంగల్ ఎంపీగా కడియం కావ్య పోటీ చేస్తోంది. ఆమెకు పోటీగా బీజేపీ నుంచి అరూరి రమేష్, బీఆర్ఎస్ నుంచి సుధీర్ కుమార్ బరిలో ఉన్నారు. ఇక బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌పై భూ కబ్జాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయి. బీజేపీపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల్లో వ్యతిరేకత, సంస్థాగతంగా బీజేపీకి క్యాడర్ లేకపోవడం వంటి అంశాలు ఆయనకు ప్రతికూలంగా మారనున్నాయి. ఈ క్రమంలో ఆయన రెండో స్థానానికి పరిమితం అవుతారని అంతా అనుకుంటున్నారు. అలాగే కేసీఆర్ పాలన పట్ల ప్రజల్లో ఇంకా వ్యతిరేకత ఉండటం, ప్రచారంలో వెనకపడటం వంటి అంశాలు బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను ఎన్నికల్లో మూడో స్థానానికి నెడుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం, ఆగస్ట్ 15 వరకు ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం వంటి అంశాలు కూడా ఆ ఇద్దరి నేతల గెలుపుకి అడ్డంకిగా మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా వారిని గెలిపిస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని కూడా ప్రజలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు నల్లేరు మీద నడకే అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే వరంగల్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండటం కూడా ఆమెకు కలిసి రానుంది. ఇక ప్రచారంలో కూడా ఆమె తదైనా స్టైల్‌లో దూసుకెళ్తున్నారు. ఇక పాలకుర్తి నియోజక వర్గంలో హనువమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యేయశస్విని రెడ్డిలతో కలిసి కడియం కావ్య చేస్తోన్న ప్రచారం ఓటర్లను విపరీతంగా ఆకర్షిస్తోంది.




విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం | 10.05.2024 | హైదరాబాద్



# టచ్ చేసే దమ్ముందా?

- కేసీఆర్, కేటీఆర్ బరితెగింపు మాటలు
- ప్రజా తీర్పు గౌరవించని గులాబీ నేతలు
- అధికారం లేకపోతే ఉండలేక పోతున్న కల్వకుంట్ల ఫ్యామిలీ
- ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా.. మారని తీరు
- ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖాళీ?
- బీఆర్ఎస్ నేతలవి సిగ్గు ఎగ్గు లేని మాటలు
- నేతలు పోతున్నా.. మేకపోతు గాంభీర్యం ఎందుకు?
- ఇప్పటికే గులాబీ పార్టీకి దూరమైన మేజర్ కేడర్
- ఎంపీ టికెట్లను ముఖం మీదనే విసిరేసి పోయినా సిగ్గు రాదా?
- గులాబీ దళపతిలో ఇంకా తగ్గని దొరతనం



అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టినా గులాబీ దళపతిలో మార్పు రావడం లేదు. తండ్రి కొడుకులు అధికారం లేకపోతే ఉండలేకపోతున్నారు. 10 ఏండ్లు అధికారం వెలగబెట్టిన కల్వకుంట్ల ఫ్యామిలీ అధికారం దూరమైతే కిందామీదా అవుతున్నారు. ఎంపీ ఎన్నికల్లో 10 సీట్లు వస్తాయని బీరాలకు పోతున్నారు. అదే జరిగితే మరో 6 నెలల్లో రాష్ట్ర రాజకీయాలను వెలగబెడతాడట. బరితెగించి, మతిలేని మాటలు చెబుతూ ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు సిగ్గు ఎగ్గు లేకుండా చెబుతుండటాన్ని చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. 10 ఏండ్ల పాటు ఆశీర్వదించిన ప్రజలను పట్టించుకొని గులాబీ దళపతి, ఇప్పుడు టీకొట్టు వెంట కూర్చొని సెల్ఫీలకు పోజులిస్తూ జనానికి దగ్గర అయినట్లు బిల్డప్ రాజకీయాలు చేయడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చి అధికారానికి దూరంగా పెట్టినా గులాబీ దళపతి తీరు మాత్రం మారడం లేదు. అదే అహంకారం, అదే దొరతనం స్పష్టం కన్పిస్తుందని ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు.

- విశాలభారతి, స్టేట్ బ్యూరో

## గూబ గూయ్ మనేలా రేవంత్ దెబ్బ

సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ప్రతిస్పందించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో చేరికలను ప్రారంభించారు. ఈ వరుసలో స్టేషన్‌ఘన్‌పూర్, భద్రాచలం ఎమ్మెల్యేలు కడియం, తెల్లం వెంకట్రావులు చేరిపోయారు. ఈ చేరికల పరంపర ఎంత కాలం సాగుతుందోననే చర్చ సాగుతోంది. కొద్దిరోజుల క్రితం రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆరెస్ నుంచి 25 ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని ప్రకటించారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోదరులు మాట్లాడుతూ బీఆరెస్ పతనం ప్రారంభమైందని, తాము తలుచుకుంటే ఆ పార్టీలో ముగ్గురు మాత్రమే మిగులుతారని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని కూల్చే దమ్ము ఎవరికి లేదని మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులెవరు మాట్లాడిన బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ ప్రకటిస్తూ కౌంటర్ అటాక్ చేస్తున్నారు.

## గొప్పతనంగా చెప్పుకోవడం సిగ్గుచేటు

ఇదిలాఉండగా పార్లమెంటు ఎన్నికలు ముగిసేవరకు ఈ పడిపోవడం, కూల్చడం, టచ్‌లో అనే పదాలు సాగుతూనే ఉంటాయని పొలిటికల్ అనలిస్టులు చెబుతున్నారు. ముందు జాగ్రత్త కోసమని చెబుతున్నప్పటికీ ఆ పార్టీ మాత్రం ఫిరాయింపులకు ఇది నాంది అయ్యే అవకాశం కూడా లేకపోలేదని అంటున్నారు. బీఆరెస్, బీజేపీ రాష్ట్ర నాయకుల తీరుతోనే, కాంగ్రెస్ పార్టీ డిఫెన్స్ రాజకీయాలు చేస్తుందని చెబుతున్నారు. విపక్ష నేతలంతా కలిసి ప్రజా తీర్పు అవహేళన చేస్తూ రాష్ట్రంలో మరోసారి రాజకీయ దిగజారుడు విధానాలను కొనసాగిస్తున్నారు. గతంలో 10 ఏండ్లపాటు పాలన చేసిన గులాబీ పార్టీ నేతలు ప్రజల కష్టసుఖాలు, సమస్యలను గాలికొదిలి, ఫక్తు అధికారం, కుర్చీ తప్ప ప్రజాతీర్పును గౌరవించాలనే ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలగొట్టడం తమ గొప్పతనంగా చెప్పుకోవడం సిగ్గుచేటంటున్నారు.

## తొలిరోజు నుంచే కుట్రలు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేపట్టినప్పటి నుంచి సర్కారు కూలిపోతోందని బీఆరెస్, బీజపీ ముఖ్యనాయకుల శాపనార్థాలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల ప్రచారం కేంద్రంగా ప్రారంభమైన సెగలు, పగలు కొనసాగుతూ ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారాయి. మీ పార్టీ ఎమ్మెల్యేలు నాతో టచ్ లో ఉన్నారంటూ మాజీ సీఎ: చెప్పుకోవడంపై జనాలు మండిపడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆరెస్ ముఖ్యనాయకుల నోటివెంట మీ పార్టీ ఎమ్మెల్యేలు మా పార్టీతో టచ్‌లో ఉన్నారని మాట వనబదుతోంది. నేడో రేపో చేరిపోతారు. మీ పార్టీ ఎమ్మెల్యేలను ఖాళీ చేయడం చిటికెలో పని అంటూ డైలాగులు పేల్చడం పరిపాటిగా మారాయి. తిరిగి మేము అధికారంలోకి వస్తామంటూ బీఆరెస్, బీజేపీ నాయకులు బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఈ డైలాగ్ వార్‌ను బీఆరెస్, బీజేపీ నాయకులే ప్రారంభించారు. తమ ప్రభుత్వాలు సుస్థిరమైనవి, కాంగ్రెస్ ప్రభుత్వం అస్థిరమైందని చెబుతూ ప్రజా తీర్పును అగౌరపరుస్తున్నాయి.

## కేసీఆర్ జోస్యానికి దిమ్మ తిరిగే కౌంటర్

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ పడగొడుతుందని సీఎం కేసీఆర్ ముందే జోస్యం చెప్పారు. 104 మంది ఎమ్మెల్యేలున్న తమ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నించారన్నారు. ఇదిలాఉండగా బీఆరెస్,బీజేపీ నాయకులు తమతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని చెబుతుండగా , ఆయా పార్టీల ఎమ్మెల్యేలే బయటకు వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటం గమనార్హం. బీఆర్ఎస్, బీజేపీ నేతల వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. మా ఎమ్మెల్యేలను ముట్టుకో చూద్దాం... రేవంత్ రెడ్డిని ముట్టుకుంటే హైటెన్షన్ వైర్ ను ముట్టున్నట్లే... నువ్వు కాంగ్రెస్ వైపు చూస్తే నీ సంగతి చూస్తామంటూ మహబూబ్ నగర్ మీటింగ్ లో వ్యాఖ్యానించారు.

## మొదటి నుంచి హస్తంపై అక్కసే

కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసిన రెండు రోజులకే బీఆరెస్ నాయకులు, ఎమ్మెల్యేలు పల్లారాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి (ప్రస్తుతం కాంగ్రెస్ లో చేరారు) మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మున్నాళ్ళ ముచ్చటే...త్వరలో బీఆరెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ప్రకటించి సంచలనానికి తెరతీశారు. ఆ తర్వాత మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ నుంచి నాయకులంతా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కూలిపోతోందంటూ వ్యాఖ్యానించారు. తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందంటూ ప్రకటిస్తూ వచ్చారు. తామేమి తక్కువ కాదని బీజేపీ ఎంపీలక్ష్మణ్ కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని, బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందంటూ చెబుతూ వస్తున్నారు. గమ్మత్తేమిటంటే ఈ ప్రభుత్వాన్ని మేము మాత్రం కూల్చమంటూ సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఐదుగురు మంత్రులు తమతో టచ్ లో ఉన్నారని చెప్పారు. తమ ఎమ్మెల్యేల జోలికి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చివేస్తామంటూ ప్రకటించారు. నెల రోజుల తర్వాత కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ప్రతిస్పందించారు. విపక్ష ఎమ్మెల్యేలు తమతో టచ్ లో ఉన్నారని చెబుతూ ఆచరణలో అమలు చేస్తూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఝలక్ ఇస్తున్నారు.

# పార్టీ గెలుపు కోసం కష్టపడుతున్న 'కాట'

- నీలం మధుకు మద్దతుగా ప్రచారం
- నీలం మధు గెలుపే లక్ష్యంగా వ్యూహం
- కాంగ్రెస్ శ్రేణుల సంపూర్ణ సహకారం
- రోజు రోజుకు పెరుగుతున్న నీలం బలం

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ కష్టపడి పని చేస్తున్నారు. కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధుకు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ అందించేందుకు కృషి చేస్తున్నారు. పార్టీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నీలం మధుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు కాట శ్రీనివాస్ గౌడ్ పార్టీలో చేరికలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నీలం మధుకు పార్టీ శ్రేణులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో పాల్గొంటున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, పథకాలను ప్రజలకు వివరిస్తూ 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి నీలం మధుకు భారీ మెజారిటీతో ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యమత్యంతో ముందుకు సాగుతూ నీలం మధు గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారు. దీంతో పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు రోజు రోజుకు బలం పెరుగుతోంది.

- పటాన్‌చెరు, విశాలభారతి





## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

- కండువాలు కప్పుకున్న కిష్టాయిపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉట్ల మాజీ సర్పంచ్ వెంకట్‌రామ్‌రెడ్డి
- పార్టీలోకి ఆహ్వానించిన కాట శ్రీనివాస్‌గౌడ్

పటాన్ చెరు నియోజకవర్గం జిన్నారం మండలం కిష్టాయిపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉట్ల మాజీ సర్పంచ్ వెంకట్ రామ్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు కిష్టాయిపల్లి సీనియర్ నాయకుడు విష్ణు తదితరులు కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థన్ని పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిని శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ గంగు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్స్ శ్రీకాంత్ రెడ్డి, గడ్డం శ్రీశైలం, మండల్ ప్రెసిడెంట్ క్రిష్ణ, ఎంపీటీసీ జనాభాయి, ఉప సర్పంచ్ రవి, అర్జున్, నాగరాజు, శ్రీనివాస్, గంగు రాజు, తదితరులు పాల్గొన్నారు.